




శ్రీశైలంలో రౌడీ రాజ్యం



శ్రీశైల నియోజకవర్గంలో ఐదేళ్లుగా అక్రమాలు, దౌర్జన్యాల చరిత్ర నడుస్తోంది. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అనుచరులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. చివరికి దేవుడి భూములను కూడా వదలకుండా కాజేశారు. కొన్నింటిలో ఎమ్మెల్యే శిల్పాకు వాటా ఉందన్న ప్రచారం జరుగుతున్నది. ఆయన తన అనుచరుల దందాను అడ్డుకోవడానికి ఏనాడూ ప్రయత్నించలేదనే విమర్శలు ఉన్నాయి. శిల్పా అనుచరులు రూ.కోట్ల అక్రమార్జన చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

- అంతులేని ఎమ్మెల్యే శిల్పా అనుచరుల ఆగడాలు
- ఐదేళ్లలో లెక్కలేనన్ని అవకతవకలు
- దేవుడి భూములను కాజేందుకు కుట్రలు
- పేదల భూములపై రాబందులు
- వర్ధన్ బ్యాంకు పేరుతో రూ.30 కోట్ల కుచ్చు టోపి
- పేదల పేరిట రుణాలతో దర్జాగా కాంట్రాక్ట్ పనులు
- వెలుగోడులో రేషన్ మాఫియా



నంద్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి)/ ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలోని కృష్ణాపురం గ్రామంలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సుమారు 250 ఎకరాల వరకు మాన్యం భూమి ఉండేది. అయితే అదే గ్రామానికి చెందిన ఎమ్మెల్యే అనుచరులు ఆలయ భూములను కబ్జా చేసి అనుభవిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం జరిగి ఏళ్ల గడుస్తున్నా వైసీపీ వారిని ప్రశ్నించేందుకు అధికారులు కూడా సాహసించడం లేదు. అంతే కాదు కబ్జా చేసిన భూములకు రికార్డులను సైతం సృష్టించి, వాటిని బ్యాంకుల్లో తనాఖా పెట్టి రుణాలు కూడా పొందినట్లు సమాచారం. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో దేవదాయశాఖ అధికారులు గప్‌చిప్‌గా ఉండిపోయారన్న విమర్శలున్నాయి. ఇక దీనికి తోడు ఎమ్మెల్యే శిల్పా అనుచరులు కొంత మంది బినామి వ్యక్తుల పేరిట ఆలయ భూములను అతి తక్కువ ధరలకే కౌలు వేలాలను దక్కించుకుని, వాటిని ఎక్కువ ధరలకు ఇతరులకు కౌలుకు ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇలా చేయడం వల్ల దేవదాయ శాఖ ఆదాయానికి రూ. లక్షల్లో నష్టం జరగడమే కాకుండా, పేద రైతులు తక్కువ కౌలుకు భూములను వ్యవసాయం చేసుకునే అవకాశం కోల్పోతున్నారు. కర్ర ఉన్నవాడిదే పెత్తనమన్న రీతిగా నియోజకవర్గంలో వైసీపీ నాయకులు తయారయ్యారని నియోజకవర్గ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెలుగోడులో రెచ్చిపోతున్న రేషన్ మాఫియా..



నంద్యాలలో రేషన్ బియ్యం అక్రమ దందా వెలుగోడులో ఎక్కువగా జరుగుతోంది. ఎక్కడ బియ్యం పట్టుబడ్డా తీగ వెలుగోడులో దొరుకుతోంది. ఈ రేషన్ బియ్యం మాఫియా వెనుక వెలుగోడు పట్టణానికి చెందిన ఎమ్మెల్యే శిల్పా అనుచరుడు, మండలంలో కీలక ఓ ప్రజాప్రతినిధి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సదరు నేత ఇప్పటికే కోట్ల రూపాయలు దండుకున్నారన్న సంగతి జిల్లాలోని వైసీపీ నేతలందరికీ తెలుసు. ఈ లెక్కన సదరు శిల్పా అనుచరుడు ఏ స్థాయిలో బియ్యం అక్రమ దందా నడిపిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. రేషన్ కార్డు ధరకు కొని తన రైస్‌మిల్‌లో పాలీష్ చేయించి, సన్న బియ్యంగా మారుస్తున్నారు. ఆ తర్వాత బియ్యాన్ని వివిధ బ్రాండ్ల లేబుళ్ల ఉన్న సంచుల్లో నింపి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. కొన్ని నెలల కింద సదరు నేతకు సంబంధించిన లారీని నంద్యాల పోలీసులు పట్టుకుని, ఆ తర్వాత అది నూకల బియ్యం అని విడిచిపెట్టడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఈ నేతకు శిల్పా అండదండలు పుష్కలంగా ఉండటంతోనే రేషన్ మాఫియాగా చెలరేగిపోతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వర్ధన్ బ్యాంకు బోర్డు తిప్పేసి..



ఎమ్మెల్యే శిల్పా మరో అనుచరుడు, వైసీపీ మాజీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గ్రంథివేముల బాలన్న ద్వారా ఆత్మకూరు కేంద్రంగా మూడేళ్ల క్రితం వర్ధన్ బ్యాంకును ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఆ బ్యాంకును ఎమ్మెల్యే శిల్పానే ప్రారంభించి 'వర్ధన్ బ్యాంకు అంటే శిల్పా బ్యాంకు' అని ప్రచారం చేశారు. దీంతో నియోజకవర్గంలోని చాలా మంది ఎమ్మెల్యే మాట నమ్మి వర్ధన్ బ్యాంకులో భారీగా డిపాజిట్లు చేశారు. సరిగ్గా మూడు నెలలు తిరగకుండానే వర్ధన్ బ్యాంకు బోర్డును తిప్పేసి, దాదాపు రూ.30 కోట్ల జనం సొమ్మును శిల్పా అనుచరుడు తన జేబులో వేసుకుని ఉడాయించాడు. ఈ విషయం బయటకు పొక్కగానే, ఎమ్మెల్యే శిల్పా బాలన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేయించాడు. ఎమ్మెల్యే శిల్పా గానీ, ఇటు అధికార పార్టీ గానీ డబ్బులు పోగొట్టుకున్న పేదలకు న్యాయం చేయడం లేదు.

పేదల రుణాలతో కాంట్రాక్ట్ పనులు..

పట్టణంలోని ఓ బ్యాంకు ఇటీవల రూ.3 కోట్ల వరకు నాబార్డు రుణాలు మంజూరు చేసింది. ఇందులోంచి నలుగురు సభ్యులతో కూడిన జాయింట్ లెవల్ గ్రూప్‌గా ఏర్పడిన వారికి గరిష్ఠంగా రూ.లక్ష రుణం ఇస్తారు. ప్రతి నెల కంతుల రూపంలో తిరిగి చెల్లించాలి. ఎమ్మెల్యే శిల్పా అండదండలు పుష్కలంగా ఉన్న ఆత్మకూరు పట్టణంలోని 1వ వార్డుకు చెందిన ఓ కీలక నాయకుడు తన భార్య ద్వారా కొంత మంది అమాయక మహిళలతో గ్రూపులు ఏర్పాటు చేయించాడు. వారి పేరు మీద దాదాపు రూ.80 లక్షల వరకు రుణాలు తీసుకున్నాడు. పేదల పేరిట బ్యాంకుల్లో తీసుకున్న రుణంతో సదరు నేత దర్జాగా కాంట్రాక్ట్ పనులు చేసుకోవడం మొదలుపెట్టాడు. తీసుకున్న రుణాలను సదరు నేత తిరిగి చెల్లించకపోవడంతో ఇటీవల బ్యాంకు అధికారులు గ్రూపు మహిళలకు పేరిట నోటీసులు జారీ చేశారు. దీంతో ఆ మహిళలు అసలు తామెప్పుడు రుణం తీసుకున్నామని బ్యాంకులో ఆరా తీశారు. ఇదంతా సదరు నాయకుడి భార్య నిర్వాకమని తెలిసి అవాక్కయ్యారు. ఇంత సొమ్మును ఎలా కట్టాలో తెలియక వారు తల పట్టుకుంటున్నారు.

పేదల భూములనూ వదలని రాబందులు..

ఎమ్మెల్యే శిల్పా మరో అనుచరుడు, రాష్ట్రస్థాయిలో ఓ కార్పొరేషన్ డైరెక్టర్ ఆత్మకూరులోని పేదల భూమిపై కన్నేసినట్లు తెలుస్తోంది. నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి ఆ భూమి తనదేనని దౌర్జన్యం చేశాడు. దీనిపై బాధిత నిరుపేద కుటుంబం న్యాయ పోరాటం చేస్తూనే ఉంది. అధికారులు వైసీపీ నాయకులకే మద్దతు తెలిపారు. దీంతో బాధితుడు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదేవిధంగా ఆత్మకూరు పట్టణంలో వివాదాస్పదంగా మారిన రూ.10 కోట్లకు పైగా విలువ చేసే ఓ ఆలయ భూమిని కాజేసేందుకు ఓ వైసీపీ నాయకుడు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకు ఓ రెవెన్యూ ఉద్యోగి తమకు సహకరించలేదని ఎమ్మెల్యే శిల్పా చొరవతో ఆయన్ని సస్పెండ్ చేయించారన్న విమర్శలున్నాయి. ఈ వ్యవహారంతో సదరు రెవెన్యూ ఉద్యోగి సామాజిక వర్గం రగిలిపోతుంది. అక్రమాలకు సహకరించకపోతే ఉద్యోగులను బలి చేస్తారా..? అని మండిపడుతున్నారు. ఇలా ప్రతి ఒక్క వర్గానికి చెందిన వారు నానా అవస్థలు పడుతున్నారు. ఈ ఎన్నికల్లో శిల్పా దిగిపోతేనే తమకు మేలు జరుగుతుందని నియోజకవర్గ ప్రజలు వెలిబుచ్చుతున్నారు.




పోలీసుల పేరిట వసూళ్ల దందా..

శ్రీశైలంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అనుచరులు చేయని దందానే లేదన్న విమర్శలు ఉన్నాయి. శ్రీశైల దేవస్థానం పరిధిలో టీకొట్టు దగ్గరి నుంచి హోటల్ దాకా ఏది పెట్టుకోవాలన్నా వైసీపీ నాయకులకు చేతులు తడపాల్సిందే. మల్లన్న సన్నిధిలో దేవస్థానం అధికారుల కన్నా.. ముందే ఆ పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుంటేనే ఏ పనైనా జరుగుతుందనేది బహిరంగ రహస్యమే! ఇక దీనికి తోడు స్థానిక వ్యాపారులు నుంచి నెలవారీ మామూళ్లు కూడా దండుకుంటూ జేబులు నింపుకోవడం అధికార పార్టీ నేతలకే చెల్లింది. దాదాపు రెండున్నరేళ్ల క్రితం వైసీపీ నాయకుడు రజాక్ తాను డీఎస్పీని అంటూ ఓ బొమ్మల వ్యాపారిని ఫోన్లో బెదిరించి నెల మామూళ్లు డిమాండ్ చేయడం నియోజకవర్గంలో జరుగుతున్న వైసీపీ మార్కు దందాకు నిదర్శనం. దీనిపై బాధితుడు ఆధారాలతో సహా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆయన్ని రిమాండ్‌కు కూడా పంపించారు. దేవస్థానానికి అవసరమైన అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను అందిస్తున్న ఏజెన్సీ ఎమ్మెల్యే శిల్పాదేనన్న ఆరోపణలున్నాయి. దీని ద్వారా కేవలం ఉద్యోగాలు మాత్రమే కాకుండా, దేవస్థానంలో జరిగే ప్రతి పనిని కాంట్రాక్టు ద్వారా దక్కించుకుంటూ, తక్కువ ఖర్చయ్యే పనులకు ఎక్కువ మొత్తానికి కోట్ చేసి ఆదాయాన్ని దండిగా కూడబెట్టుకుంటున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే శ్రీశైలం దేవస్థానం నుంచి ఎమ్మెల్యే శిల్పాకు ప్రతి నెల రూ.కోటికిపైగా అక్రమంగా సొమ్ము సమకూరుతుందన్న ప్రచారం నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది.



28న చంద్రబాబు రాక



కర్నూలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారం, ప్రజాగళం యాత్రలో భాగంగా ఈ నెల 28న టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు జిల్లాకు రానున్నారు. ఈ మేరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, టీడీపీ జోన్-5 ఇన్‌చార్జి బీద రవిచంద్ర, జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి తదితరులు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ఎమ్మిగనూరు, ఆలూరులో ప్రజాగళం పేరిట ప్రచారం నిర్వహించిన చంద్రబాబు రెండో విడత ప్రచారంలో భాగంగా 28న కర్నూలు, కోడుమూరు, మంత్రాలయంలో జరిగే ప్రచార సభల్లో పాల్గొనే అవకాశం ఉంది. 29న నంద్యాల పార్లమెంటు పరిధిలో జరిగే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. అయితే 29వ తేదీ పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

ముస్లింలను ముంచేసిన వైసీపీ



- జగన్ మాయమాటలను నమ్మకండి
- శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్

ఆత్మకూరు, ఏప్రిల్ 23: ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ముస్లింలను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురి చేసిందని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ ఆరోపించారు. ముస్లింలను ముంచేసిన వైసీపీని మళ్లీ నమ్మకూడదని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శ్రీశైలం టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎంఏ షరీఫ్ మాట్లాడుతూ శాసనమండలిలో మూడు రాజధానుల బిల్లు విషయంలో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్సీలు తనను అనేక విధాలుగా బెదిరింపులకు, విమర్శలకు పాల్పడినా తాను ధర్మబద్ధంగా వ్యవహరించినట్లు చెప్పారు. అలాగే ఐదేళ్ల వైసీపీ పాలనతో ప్రజలు అనేక కష్టాలు, పోరాటాలతో ముందుగు సాగారని, నేడు జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. ప్రత్యేకంగా చెప్పాలని వైసీపీ పాలనలో ముస్లింలకు అన్నివిధాలుగా అన్యాయం జరిగిందని గుర్తుచేశారు. గత టీడీపీ పాలనలో ఐదేళ్లలో రూ.2500కోట్ల నిధులు ముస్లిం సంక్షేమానికి కేటాయించామని, అయితే వైసీపీ పాలనలో పైసా కూడా విడుదల చేయలేదని అన్నారు. ముస్లింల కుటుంబాల్లో పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి సమస్యలు ఉన్నాయని గుర్తించిన చంద్రబాబు ముస్లింల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి చేయూతనిచ్చారని అన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే ఆయా పథకాలన్నింటిని రద్దు చేశారని విమర్శించారు. ఎన్నికల ముందు సీఎం జగన్ ముస్లింలకు అనేక హామీలు ఇచ్చి నేడు ఒక్కటైనా నెరవేర్చారా..? అని ప్రశ్నించారు. అలాగే వైసీపీ పాలనలో ముస్లిం మైనార్టీలపై వేధింపులు అధికవ్వడంతో ఎంతో మంది ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసమే టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల పొత్తు ఏర్పడిందని గుర్తుచేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఇక్బాల్ అహ్మద్, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్‌అహ్మద్, జిల్లా అధ్యక్షుడు కలిముల్లా తదితరులు పాల్గొన్నారు.

దళితులకు రక్షణ కరువు : గౌరు చరిత

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 23: వైసీపీ ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువైందని పాణ్యం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ అల్లరి మూకల దాడిలో గాయపడ్డ పెరుమాళ్ల చంద్రశేఖర్‌ను ఆమెతో పాటు నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి మంగళవారం ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ గడివేముల మండలం దుర్వేశి గ్రామంలో ఎన్నికల ప్రచారం ముగించుకుని ఇంటికి వెళ్తున్న టీడీపీ నాయకుడు, దళిత వర్గానికి చెందిన చంద్రశేఖర్‌ను వైసీపీ నాయకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. వైసీపీ పాలనలో దళితులపై నిత్యం అకృత్యాలు జరుగుతున్నా జగన్‌మోహన్‌రెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు. కరోనా సమయంలో మాస్కులు అడిగినందుకు దళిత వైద్యుడిని కొట్టి చంపారన్నారు. దళిత కారు డ్రైవర్‌ను చంపి ఇంటికి శవాన్ని వైసీపీ ఎమ్మెల్సీ డోర్ డెలివరీ చేసిన దారుణ ఘటన జగన్ హయాంలోనే జరిగిందన్నారు. జగన్ ప్రభుత్వ అక్రమాలు ప్రశ్నించిన దళిత యువకుడిని పోలీసు స్టేషన్‌లోనే చిత్రహింసలు పెట్టి శిరోముండనం చేసిన చరిత్ర జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దుర్వేశి ఘటనపై బాధ్యులైన వారిపై వెంటనే హత్యాయత్నం కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్‌చేశారు. బాధితులకు టీడీపీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. బాధితుడిని పరామర్శించిన వారిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ గౌడ్, మాల సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు ఎనుముల రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



నంద్యాల ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న బైరెడ్డి శబరి



బాధితుడిని పరామర్శిస్తున్న మల్లెల రాజశేఖర్, గౌరు చరిత

ఐదో రోజు 39 నామినేషన్లు..!

ఇప్పటి వరకు 90 మంది దాఖలు

నంద్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఐదో రోజైన మంగళవారం నంద్యాల పార్లమెంటుతో జిల్లాలోని ఆయా నియోజకవర్గాలకు 39 నామినేషన్లు దాఖలయ్యాయి. నంద్యాల పార్లమెంటుకు నలుగురు, ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు 35 నామినేషన్లు సమర్పించారు. నంద్యాల పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరఫున జే. లక్ష్మీనరసింహ యాదవ్, చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అభ్యర్థి ఉప్పు సుబ్బారాయుడు, స్వతంత్ర అభ్యర్థులు రెడ్డిపోగు విజయభాస్కర్, బి వెంకటేశ్వర్లు నామినేషన్లు వేశారు. ఇక ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గానికి బీఎస్పీ అభ్యర్థి వరికూటి హన్నమ్మ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బి.హుసేన్ బాషా (రెండు సెట్లు), అన్న వైఎస్సార్ అభ్యర్థి ఎం. చెన్నయ్య, స్వతంత్ర అభ్యర్థులు మరియదాస్, కె. చంద్రశేఖరరెడ్డి, టీపీ నరసింహారావు తమ నామినేషన్లు దాఖలు చేశారు. శ్రీశైలం నియోజకవర్గానికి సంబంధించి వైసీపీ అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి, స్వతంత్ర అభ్యర్థులు పెద్దిరెడ్డి గంగాధర్‌రెడ్డి, మునగాల నాగమల్లికార్జున రెడ్డి, ఇలియాస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజహర్ సయ్యద్ ఇస్మాయిల్, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి సయ్యద్ మహమ్మద్ సికిందర్ బాషా నామినేషన్లు సమర్పించారు. నందికొట్కూరు నియోజకవర్గానికి సంబంధించి జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి బొరెల్లి వెంకటరాముడు, వైసీపీ అభ్యర్థి కాటం వెంకటరమణ, బీసీవై అభ్యర్థి చిమ్మె వెంకటరమణ, సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి షాబోలు లింకన్ రాజు నామినేషన్లు సమర్పించారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి ఐజే వెంకటరమణ, టీడీపీ నుంచి యాపరాళ్ల లక్ష్మీనరసమ్మ, యుగతులసీ పార్టీ అభ్యర్థి సల్లా రమేశ్, కాంగ్రెస్ పార్టీ నుంచి గోసవరం గోకుల కృష్ణారెడ్డి, జి స్వాతిరెడ్డి, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నుంచి షేక్ అబ్బాస్, షేక్ జాఫర్, స్వతంత్ర అభ్యర్థులు రామదాసు, రవికుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. బనగానపల్లె నియోజకవర్గం నుంచి బీఎస్పీ నుంచి చెన్నయ్య, స్వతంత్ర అభ్యర్థులు కేదం సుబ్బారాయుడు, గోపాజి సుబ్బారాయుడు, కాశిరెడ్డి రఘునాథరెడ్డి, గోగుల సుగుణమ్మ, పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, డోన్ నియోజకవర్గానికి సంబంధించి బీసీవై అభ్యర్థి బాలసుబ్బయ్య, స్వతంత్ర అభ్యర్థి ముత్యాల శివరామయ్య ఆచారి నామినేషన్లను దాఖలు చేశారు. మొదటి నాలుగు రోజుల్లో మొత్తం 51 నామినేషన్లు దాఖలు కాగా, ఐదో రోజు39 నామినేషన్లు, వెరసి ఇప్పటి వరకు 90 నామినేషన్లు దాఖలయ్యాయి.



కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి లక్ష్మీ నరసింహయాదవ్

అబ్బ-ఛా!

సారుకు కారు లేదట..!

- ఆస్తులు మాత్రం రూ.13.77 కోట్లు
- నామినేషన్ పత్రాల్లో పేర్కొన్న వైసీపీ అభ్యర్థి సాయిప్రసాద్ రెడ్డి



ఆదోని, ఏప్రిల్ 23: ఆదోని వైసీపీ అభ్యర్థిగా సాయిప్రసాద్ రెడ్డి మంగళవారం రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇటీవల ఎమ్మిగనూరుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అభ్యర్థులను పరిచయ కార్యక్రమంలో భాగంగా "ఆదోని సాయన్న గురించి నేను మీకు చెప్పాల్సిన పని లేదు... మీ అందరికీ పరిచయస్తుడు... కాకపోతే డబ్బులు విషయంలో మాత్రం అంతంత మాత్రమే... కాని మంచివాడు... సౌమ్యుడు..." అంటూ సెలవిచ్చారు. అయితే సాయన్న తనకు కారు కూడా లేదని నామినేషన్ పత్రాల్లో పేర్కొనడాన్ని చూసిన జనం జగన్ మాటల్ని అక్షర సత్యం చేశారని వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. నామినేషన్ పత్రాలలో తన కుటుంబ స్థిర, చర ఆస్తుల వివరాలతోపాటు బంగారు ఆభరణాలు, భూముల వివరాలు చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. ఆయన ఆస్తులు రూ.13.77 కోట్లని, తనకు ఒక్క వాహనం కూడా లేదని పొందుపరిచారు. ఇంటి చుట్టూ పదుల సంఖ్యలో సొంత వాహనాలు ఉన్నా అఫిడవిట్‌లో మాత్రం ఒక్క వాహనం కూడా తన పేరున లేదంటూ చూపడం నియోజకవర్గ ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఉచితాలకు బానిసలు కావద్దు...

పెద్దల మాట..



ఆలూరు, ఏప్రిల్ 23: రాజకీయ పార్టీలు ప్రకటించిన ఉచితాలకు, నోటుకు బానిసలు కాకూడదు. ఐదేళ్ల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. అప్పట్లో వ్యక్తిని, వ్యక్తిత్వాన్ని చూసి ఓటేసే వాళ్లం... కానీ ఇప్పుడు పథకాలకు, ఓటుకు నోటుకు ఆకర్షితులవుతున్నారు. తమ భవిష్యత్తును తాకట్టు పెడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే భావితరాలు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. రాజకీయ పార్టీల ఉచితాలను పక్కనపెట్టి ఉద్యోగ అవకాశాలు, ఉపాధి కల్పనపై దృష్టి సారించాలి. ఓటర్ ఆలోచించి తమ భవిష్యత్తుకు భరోసా ఇచ్చే నాయకులు ఎన్నుకోవాలి.

– నరసన్న, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

పూల బొకేలకు భలే గిరాకీ



ఎమ్మిగనూరు, ఏప్రిల్ 23: ఎన్నికల సమయం కావడంతో పూలబొకేలకు గిరాకీ పెరిగింది. వైసీపీ నుంచి కొత్త అభ్యర్థి బుట్టా రేణుక మహిళ కావడంతో ఆమెను కలిసేందుకు వచ్చే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలహారాలతో కాకుండా పూలబొకేలతో పార్టీ కార్యాలయానికి వస్తున్నారు. ఆమెకు పూలహారం వేసేందుకు అవకాశం లేకపోవడంతో పెద్ద ఎత్తున వచ్చేవారంతా పూల బొకేలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఉన్న పూలదుకాణాల్లో గిరాకీ పెరిగింది. గతంలో ఎప్పుడో ఎవరో వీఐపీలు వచ్చినప్పుడు మాత్రమే వీటిని కొనుగోలు చేసేవారు. అయితే బుట్టా రేణుక వైసీపీ నుంచి పోటీ చేస్తుండడంతో పూల బొకేలకు భారీగా గిరాకీ పెరిగిందని పూల దుకాణాదారులు పేర్కొంటున్నారు.



కార్పొరేటర్లు కాస్ట్‌లీ గురూ!

- జంపింగ్ జపాంగ్‌లతో వైసీపీలో గుబులు
- ఒక్కొక్కరికి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు..
- పక్క చూపులు చూడకుండా తాయిలాలు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 23: నియోజకవర్గంలో అధికార వైసీపీ తమ పార్టీ కార్పొరేటర్లకే డబ్బు పంచాల్సి వస్తోంది. కొందరు కార్పొరేటర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకపోవడంతో వారు టీడీపీ వైపు వెళ్తారేమోననే ఆందోళనతో అధికార పార్టీ తాయిలాలకు తెరతీసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే కార్పొరేటర్లకు వారి బలాన్ని బట్టి రూ.లక్షలు ముట్టజెప్పినట్లు తెలిసింది. కర్నూలు అర్బన్ నియోజకవర్గంలో 33 వార్డులు ఉన్నాయి. ఇందులో 11 మంది కార్పొరేటర్లు టీడీపీకి చెందినవారు ఉండగా మిగిలిన 22 మంది వైసీపీ కార్పొరేటర్లే. అయితే టీడీపీ కార్పొరేటర్లు ఉండే చోట వైసీపీ నుంచి వార్డుకు ఇన్‌చార్జిలను నియమించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా టీజీ భరత్, వైసీపీ అభ్యర్థిగా ఎండీ ఇంతియాజ్ పోటీ చేస్తున్నారు. ప్రధాన పోటీ ఈ ఇద్దరి మధ్యే ఉండనుంది.



● ఒక్కొక్కరికి రూ.3 లక్షల నుంచి రూ. 5 లక్షలు..

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొందరు కార్పొరేటర్లు నిశబ్దంగా ఉండటం వైసీపీ అభ్యర్థికి గుబులు రేపుతోంది. దీంతో కొత్త ఓట్లు దేవుడెరుగు, ఉన్న ఓట్లు నిలుపుకుంటే చాలు అనుకునే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే కార్పొరేటర్లకు తాయిలాలు పంచుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల వైసీపీ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. దీంతో ప్రస్తుతం వైసీపీ కార్పొరేటర్ల సంఖ్య 22, టీడీపీ కార్పొరేటర్లు సంఖ్య 11 మంది చేరింది. అయితే వైసీపీలో గెలుపొందిన వారు అత్యధికంగా కొత్తగా పోటీ చేసిన వారే. నియోజకవర్గ పరిధిలో ఇంకా కొన్ని వర్గాలు ఎమ్మెల్యే అభ్యర్థికి దూరంగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో కార్పొరేటర్‌తోపాటు వార్డు ఇన్‌చార్జిలకు డబ్బుల గాలం వేసినట్లు సమాచారం. ఒక్కో కార్పొరేటర్‌కు రూ.3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు ముట్టజెప్పినట్లు తెలిసింది. నగరంలో 22 మంది కార్పొరేటర్లు, 11 మంది ఇన్‌చార్జిలకు లెక్కలు అందినట్లు సమాచారం.

● జంపింగ్ ఊహాగానాలతోనే..: ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఓ ప్రచారం ఊపందుకుంది. వైసీపీ నుంచి టీడీపీలోకి సుమారు పది మంది కార్పొరేటర్లు వెళ్తారనే ప్రచారం జరిగింది. దీంతో గోడ దూకే కార్పొరేటర్లపై వైసీపీ నేతలు ఆరా తీసినట్లు తెలిసింది. ఇప్పటికే 17,22 వార్డుల కార్పొరేటర్లు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో మరింత మంది జంప్ అయ్యే ప్రమాదముందని భావించిన వైసీపీ నేతలు దిద్దుబాటు చర్యలకు దిగారు. అంతేగాకుండా మాజీ ఎమ్మెల్యే మాటలు వింటూ ప్రస్తుతం కార్పొరేటర్లను ఎమ్మెల్యే అభ్యర్థి దూరం పెడుతున్నారనే ప్రచారం కూడా కొనసాగుతోంది. అంతేగాకుండా శుక్రవారం మధ్యాహ్నం నగరంలోని ఓ చోట 19 మంది కార్పొరేటర్లు రహస్య సమావేశం ఏర్పాటు చేసుకున్నారని సోషల్ మీడియాలో హల్‌చల్ లేపింది. అందుకే ముడుపుల బేరం పెట్టినట్లు సమాచారం. అలా రూ.లక్షలు నింపుకున్న కార్పొరేటర్లు వైసీపీ అభ్యర్థి ప్రచారం పాల్గొంటారా లేదా అని పలువురు చర్చించుకుంటున్నారు.

లెక్కలు చూపకపోతే చిక్కులే..

ఆదోని, ఏప్రిల్ 23: ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయాన్ని పక్కాగా లెక్క చూపాల్సిందే... లేనిపక్షంలో ఎన్నికల కమిషన్ నుంచి చిక్కులు తప్పవు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, సెక్షన్-19 ప్రకారం ఎన్నికల లెక్కలు చూపని అభ్యర్థులపై ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి ఎన్నికల వ్యయాన్ని రూ.40 లక్షలుగా ఎన్నికల కమిషన్‌కు నిర్దేశించింది. ఆ మొత్తంలోనే అభ్యర్థుల వ్యయం చేయాల్సి ఉంటుంది. నామినేషన్ వేసినప్పటి నుంచి పోలింగ్ ముగిసే వరకు వ్యయాన్ని రశీదులతో సహా జిల్లా ఎన్నికల అధికారికి సమర్పించాలి. రూ.40 లక్షల వ్యయం మించితే అందుకు సరైన ఆధారం చూపాలి. లెక్కల్లో ఏమాత్రం తేడా వచ్చినా, ప్రజా ప్రాతినిధ్యం చట్టం 1951 సెక్షన్ 10(ఏ) ప్రకారం ఎన్నికైన అభ్యర్థుల అభ్యర్థిత్వాన్ని ఎన్నికల కమిషన్ రద్దు చేసే అవకాశం ఉంటుంది. అలాగే ఎన్నికైన అభ్యర్థులతోపాటు, ఓడిన అభ్యర్థులు కూడా తదుపరి ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించే అవకాశం ఉంటుంది. అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని ఎప్పటికప్పుడు షాడో అబ్జర్వర్స్ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న వ్యయ అంచనాను నమోదు చేస్తుంటారు.



అప్పుడే మొదలైన డబ్బు పంపిణీ

ఆదోని, ఏప్రిల్ 23: అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే పోల్ మేనేజ్మెంట్‌పై కసరత్తు ప్రారంభించాయి. అభ్యర్థులు ఓటరు నాడి ఎటువైపో పసిగట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో చివరి అస్త్రంగా డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టాయి. ప్రధాన రాజకీయ పార్టీలు కోట్లాది రూపాయలు ఖర్చు చేసే స్తోమత ఉన్న అభ్యర్థులనే ఎన్నికల బరిలో నిలిపాయి. దీంతో ఏ పార్టీకి చెందని తటస్థులైన ఓటర్లు తమకు మూడు పార్టీల నుంచి డబ్బులు వస్తాయని ఆశలు పెట్టుకున్నారు. గతంలో సాధారణంగా పోలింగ్ జరిగే ముందు రోజు రాత్రి ఆయా పార్టీల స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి తలుపు తట్టి ఓటర్ల సంఖ్యను లెక్కగట్టి డబ్బులు పంపిణీ చేసేవారు. అనేక కుటుంబాలు ఎలాగో డబ్బులు పంపిణీ చేస్తారనే ఆశతో రాత్రంతా నిద్రపోకుండా వేచి ఉండేవారు.



కాంగ్రెస్ వర్సెస్ టీడీపీ

- ఎమ్మిగనూరులో ఎక్కువ సార్లు గెలిచిన పార్టీలు ఇవే..
- రెండు సార్లు ఉప ఎన్నికలు
- ఈ సారి విజయం ఎవరిదో..!

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 23: ఎంతో సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 17వ సారి ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటి వరకు 14 సార్లు సాధారణ ఎన్నికలు జరగ్గా.. రెండు సార్లు ఉప ఎన్నికలు జరిగాయి. 1955లో ద్విసభ నియోజకవర్గంగా ఆవిర్భవించిన ఎమ్మిగనూరు నుంచి ముఖ్యమంత్రి స్థాయి నాయకులు పోటీ చేసి గెలిచారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ ఆరు సార్లు, టీడీపీ ఆరు సార్లు, ఒకసారి స్వతంత్ర అభ్యర్థి, ఒకసారి కాంగ్రెస్(ఐ) అభ్యర్థి, రెండు సార్లు వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. 1955 ద్విసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, దామోదరం సంజీవయ్య తమ సమీప ప్రత్యర్థులు పీఎస్పీ అభ్యర్థి ఎస్ఎస్ రెడ్డి, సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్యలపై విజయం సాధించారు. 1962లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన వైసీ వీరభద్రగౌడు కాంగ్రెస్ అభ్యర్థి కేవీ రెడ్డిపై విజయం సాధించారు. అలాగే 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పి. సత్యనారాయణరాజు స్వతంత్ర అభ్యర్థి వైసీ వీరభద్రగౌడుపై విజయం సాధించారు. 1972లో తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన సత్యనారాయణరాజు ఎన్‌సీవో అభ్యర్థి ఎంవై సోమప్పపై విజయం సాధించారు. 1978లో కాంగ్రెస్(ఐ) అభ్యర్థిగా బరిలోకి దిగిన కేఆర్ హనుమంతరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి రామచంద్రారెడ్డిపై గెలిచారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తర్వాత జరిగిన మొదటి ఎన్నికల్లో 1983లో కాంగ్రెస్ అభ్యర్థిగా ముఖ్యమంత్రి హోదాలో ఎమ్మిగనూరు నుంచి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి బరిలోకి దిగి టీడీపీ అభ్యర్థిగా నిలిచిన అబ్దుల్ రజాక్‌పై విజయం సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ గాలి వీచినా ఎమ్మిగనూరులో మాత్రం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి గెలవడం చరిత్రను తిరగరాసినట్లయింది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోవడంతో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కేంద్ర ప్రభుత్వంలోకి వెళ్లారు. దీంతో 1984లో జరిగిన ఉప ఎన్నికల్లో ఎన్టీఆర్ ప్రియ శిష్యుడు బీవీ మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు నుంచి మొదటి సారి ఉప ఎన్నికలో పోటీ చేశారు. ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన కేఆర్ హనుమంతరెడ్డిపై ఆరువేల పైచిలుకు ఓట్లతో విజయఢంకా మోగించారు. ఆ తర్వాత 1985లో జరిగిన సాధారణ ఎన్నికల్లో బీవీ మోహన్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి దేవేంద్రగౌడు, 1989లో కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ శివన్న, 1994లో కాంగ్రెస్ అభ్యర్థి ఎర్రకోట కేశవరెడ్డి, 1999లో మరోసారి కాంగ్రెస్ అభ్యర్థి ఎర్రకోట కేశవరెడ్డిపైన విజయం సాధించారు. ఆ తర్వాత 2004లో, 2009లో జరిగిన ఎన్నికల్లో బీవీ మోహన్‌రెడ్డిపైన కాంగ్రెస్ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి విజయం సాధించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణానంతరం ఆవిర్భవించిన వైసీపీలో చేరిన చెన్నకేశవరెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో 2012లో ఎమ్మిగనూరు నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా చెన్నకేశవరెడ్డి, టీడీపీ అభ్యర్థిగా బీవీ మోహన్‌రెడ్డి పోటీలో నిలవగా చెన్నకేశవరెడ్డి గెలిచారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా చెన్నకేశవరెడ్డి తనయుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా దివంగత నేత బీవీ మోహన్‌రెడ్డి తనయుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో బీవీ జయనాగేశ్వరరెడ్డి విజయం సాధించి ఎమ్మిగనూరు నియోజకవర్గంపై మరోసారి టీడీపీ జెండాను ఎగురవేశారు. బీవీ వారసుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ఆయన మొదలు పెట్టారు. అనంతరం 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా చెన్నకేశవరెడ్డి, టీడీపీ అభ్యర్థిగా బీవీ జయనాగేశ్వరరెడ్డి పోటీ పడ్డారు. ఈ ఎన్నికల్లో చెన్నకేశవరెడ్డి గెలిచారు. తాజాగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పరిస్థితులు తారుమారయ్యాయి. మూడు దశాబ్దాలుగా బీవీ కుటుంబంతో తలపడిన ఎర్రకోట కుటుంబానికి టికెట్ దక్కలేదు. ఎమ్మిగనూరు ఎన్నికల చరిత్రలో తొలిసారి మహిళా అభ్యర్థి బుట్టా రేణుక బరిలోకి వచ్చారు. టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, వైసీపీ నుంచి మాజీ ఎంపీ బుట్టా రేణుక రేసులో ఉన్నారు. ఈ సారి విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి మరి.



ఇష్టారీతిన ఖర్చు పెడతామంటే కుదరదు



కర్నూలు (కలెక్టరేట్), ఏప్రిల్ 23: అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల ఇష్టారీతిన ఖర్చు పెట్టడానికి లేదు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. వీరి ఖర్చుల వివరాలను తెలుసుకోవడానికి ఇప్పటికే జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు దృష్టి సారించారు. అభ్యర్థుల ప్రచారం, సభలు, ర్యాలీలు తదతర కార్యక్రమాల ఖర్చును ఎప్పటికప్పుడు లెక్కిస్తున్నారు. నిబంధనలను అతిక్రమించి ఖర్చు చేస్తే పడే అవకాశం ఉంది. అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి ఎన్నికల కమిషన్ నిర్ణయించిన ధరలు ఇలా ఉన్నాయి. అభ్యర్థులు ఉపయోగించే వాహనాన్ని బట్టి ఒక రోజు అద్దె రూ.1000 నుంచి రూ.1800 వరకు ఉంది. డ్రైవర్ బత్తా రోజుకు రూ.500 ఇవ్వాలి. ఆహార పదార్థాలకు సంబంధించి మజ్జిగ రూ.10, జ్యూస్ రూ.50, కోకోనట్ వాటర్ రూ.50, వాటర్ బాటిల్స్ రూ.20, ఇడ్లీ రూ.30, చికెన్ ధమ్ బిర్యాని రూ.170, చికెన్ కర్రి రూ.120, ఫుల్ మీల్స్ రూ.120, మటన్ కర్రి రూ.300, వుడ్‌కు చెందిన కటౌట్స్, స్క్వేర్ ఫీట్‌కు రూ.80, క్లాత్ అండ్ ప్లాస్టిక్ చెందిన కటౌట్స్ స్క్వేర్ ఫీట్‌కు రూ.40, బ్యానర్స్ విషయంలో స్క్వేర్ ఫీట్‌కు రూ.30, ప్లాస్టిక్ బ్యానర్స్ స్క్వేర్ ఫీట్‌కు రూ.15లు, టేబుల్‌కు రూ.50, బారికేడ్లు, స్క్వేర్ ఫీట్‌కు రూ.20, క్లాత్ ఫ్లాగ్ 6/3 (180), పార్టీ గుర్తుతో ఉన్న టోపీలు ఒకటి రూ.50, టీషర్ట్స్ ఒకటి రూ.120, ప్లాస్టిక్ ఫ్లాగ్ 10/4 సైజు రూ.800, 6/3 సైజు రూ.500, 4/3 సైజు రూ.350, 3/2సైజు రూ.200, పాంప్లెట్స్ ఏ4సైజ్ పేపర్ 1000కి రూ.2వేలు ఏ4 టూ సైజ్ పేపర్ 1000కి రూ.వెయ్యి, కల్చరల్ ప్రోగ్రామ్ గ్రూప్స్ ఒక్కరికి రూ.1000, జనరేటర్ ఒక రోజుకు అద్దె రూ.1000, ప్లాస్టిక్ కుర్చీ రూ.6లు, హ్యాండ్ కుర్చీ రూ.10, మహారాజా కుర్చీలు రూ.1,200, షామీయానా 18/36 సైజు రూ.1,500, 12/24 సైజు రూ.1,000, 9/18 సైజు రూ.600, డ్రమ్స్, మ్యూజికల్స్ హెడ్‌కి రూ.1000, గ్రీన్‌కార్పెట్స్ 6/30 సైజు ఒక రోజుకు రూ.200, ఆపరేటర్, స్పీకర్ వాహనంతో కలిపి రూ.6,500 డీవీడి ఒక రోజుకు రూ.2,500 ట్రాఫిక్ సిగ్నల్ అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు ఒక స్క్వేర్ మీటర్‌కు రూ.2,100, సీసీ కెమెరా పోల్ బోర్డ్స్ రూ.2,100, సినిమా హాల్స్‌లో అడ్వర్టైజ్మెంట్ కలర్ వన్ సైడ్ ఫర్ మంత్ రూ.1,950, ట్రైలర్స్ 150మీటర్ల వరకు ఒక నెలకు రూ.6,000, 150 నుంచి 300 మీటర్ల వరకు ఒక నెలకు రూ.13,500, హోటల్ సింగిల్ రూమ్ ధర రూ.500, డబుల్ రూమ్ రూ.1,500 ఎన్నికల సంఘం నిర్ణయించింది.

హ్యాట్రిక్ ఎమ్మెల్యే మసాల ఈరన్న



ఆలూరు, ఏప్రిల్ 23: ఆలూరు నియోజకవర్గంలో మసాలా ఈరన్న అంటే బ్రాండ్... మాస్ లీడర్‌గా పేరు సంపాదించుకున్నారు. ఆయన పెద్దగా చదువుకోకపోయినా ఆలూరు నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఒకసారి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేశారు. ఆలూరు నియోజకవర్గం 1955లో ఏర్పడింది. రెండు పర్యాయాలు ఓసీ జనరల్‌గా ఉంది. 1960లో ఎస్సీ జనరల్‌గా మారింది. 1978లో ఇండియన్ కాంగ్రెస్ నుంచి 1985లో కాంగ్రెస్ పార్టీ నుంచి 1994లో టీడీపీ నుంచి పోటీ చేసి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 1987 నుంచి 1992 వరకు జిల్లా పరిషత్ చైర్మన్‌గా సేవలు అందించారు.

ఆ నాలుగు పార్టీలదే హవా

ఆదోని టౌన్, ఏప్రిల్ 23: ఆదోని అసెంబ్లీ స్థానానికి 1955 నుంచి ఇంత వరకు 14 సార్లు ఎన్నికలు జరిగితే, వివిధ రాజకీయ పార్టీల నుంచి అభ్యర్థులు పోటీ పడుతూ వచ్చారు. కానీ అందులో నాలుగు పార్టీల అభ్యర్థులు మాత్రం విజయం సాధిస్తూ తమ హవాను కొనసాగిస్తూ వస్తున్నారు.

● పోటీలో ఇంత వరకూ పాల్గొన్న పార్టీలు...

1955 నుంచి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పీఎస్‌పీ (ప్రజా సోషలిస్టు పార్టీ), పీపీ పార్టీ, ఎస్‌డబ్ల్యూఏ (స్వతంత్ర పార్టీ), తెలుగుదేశం, వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్, జనసేన, బీజేపీ, సీపీఎం, టీడీపీ ఎన్‌టీఆర్ (యల్‌పీ), బీఎస్‌పీ, ఆమ్ ఆద్మీ పార్టీ, జనతా పార్టీ, ఎంఐఎం, పీడీఓఐ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా) పార్టీల నుంచి అభ్యర్థులు పోటీ పడుతూ వచ్చారు.

● రెండు సార్లు ఇండిపెండెంట్ అభ్యర్థులు..

14 సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో 15 వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు పోటీలో పాల్గొన్నా పీఎస్‌పీ, కాంగ్రెస్, టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులు మాత్రమే గెలుస్తూ వచ్చారు. పీఎస్‌పీ తరపున ఒకసారి, కాంగ్రెస్ తరపున ఆరు సార్లు, టీడీపీ తరపున మూడుసార్లు, వైసీపీ తరపున రెండు సార్లు అభ్యర్థులు విజయం సాధిస్తూ వచ్చారు. రెండు సార్లు ఇండిపెండెంట్ అభ్యర్థులు కూడా గెలవడం విశేషం.

పోలింగ్ ఏజెంట్లే కీలకం...



ఆదోని, ఏప్రిల్ 23: పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరపున పరిశీలనకు కూర్చునే ఏజెంట్ల పాత్రే కీలకం. బోగస్ ఓట్లు పడకుండా ఓటేయడానికి వచ్చే వారిని వీరు నిశితంగా పరిశీలిస్తారు. గుర్తింపు పొందిన రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థు ప్రాధాన్యత క్రమంలో ఏజెంట్లు కూర్చుంటారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రతి అభ్యర్థి తరపున ఒక పోలింగ్ ఏజెంట్, ఇద్దరు రిలీఫ్ ఏజెంట్లను నియమించుకోవచ్చు. ఏజెంట్లు ఓటరుగా నమోదై ఉండటంతోపాటు ఫొటో గుర్తింపు కార్డు ఉండాలి. కేంద్రంలో జరిగే ప్రతి కదలిక, తతంగాన్ని ఏజెంట్ నిశితంగా పరిశీలించాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా, ప్రిసైడింగ్ అధికారి, పరిశీలకులు, సూక్ష్మ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చు.

సార్వత్రిక ఎన్నికల పరిశీలకుల నియామకం

కర్నూలు (కలెక్టరేట్), ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం కర్నూలు జిల్లాకు ఎన్నికల పరిశీలకులు నియమించబడ్డారని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన తెలిపారు. జాఫర్ ఐఏఎస్, కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికల పరిశీలకులుగా ఉంటారని చెప్పారు.. మీర్ తారిఖ్ ఆలి ఐఏఎస్ ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికల పరిశీలకులుగా, ఉమేష్ కుమార్ ఐపీఎస్ కర్నూలు పార్లమెంటు పరిధిలోని కర్నూలు, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని ఆలూరు నియోజకవర్గాలకు పోలీసు పరిశీలకులుగా నియమితులయ్యారని తెలిపారు. ఎన్నికల వ్యయ పరిశీలకులుగా ఆర్ఆర్ఎం శుక్లా ఐఆర్ఎస్, కర్నూలు పార్లమెంటు నియోజకవర్గానికి, అరిందమ్ ముఖోపాధ్యాయ్ ఐఆర్ఎస్, కర్నూలు, పాణ్యం పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాలకు రాకేష్ భదాదియా ఐఆర్ఎస్ ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, నియోజకవర్గాలకు నియమితులయ్యారు.

- వీసీ జాఫర్ ఐఏఎస్ - 6300932374
- మీర్ తారిఖ్ ఆలి, ఐఏఎస్ - 6300924829
- ఉమేష్ కుమార్ ఐపీఎస్ - 9014300783
- ఆర్ఆర్ఎం శుక్లా ఐఆర్ఎస్ - 6300318487
- అరిందమ్ ముఖోపాధ్యాయ్ ఐఆర్ఎస్ - 6300322616
- రాకేష్ భదాదియా ఐఆర్ఎస్ - 6300316818

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

వైసీపీ విధానాలతో విసిగిపోయారు: ఫరూక్



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 23: వైసీపీ అవలంబిస్తున్న విధానాలతో విసిగిపోయి ఆ పార్టీలో ఉండలేక టీడీపీలోకి చేరుతున్నారని నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం శిల్పా నగర్, బొంతలవీధి నుంచి భారీగా టీడీపీలో చేరారు. ఫరూక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గోస్పాడు: తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో వైసీపీలో వణుకుపుట్టిందని నంద్యాల తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం జూలేపల్లె గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, వీర సింహారెడ్డి, పల్లె విశ్వనాథ్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, గోవిందరెడ్డి, పుండరీకాంక్షరెడ్డి, పేరయ్య చౌదరి, వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందికొట్కూరు జై భారత్ పార్టీ అభ్యర్థిగా వెంకటరాముడు నామినేషన్



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న వెంకటరాముడు

నందికొట్కూరు, ఏప్రిల్ 23: నందికొట్కూరు నియోజకవర్గంలో మంగళవారం నలుగురు అభ్యర్థుల నామనేషన్లను దాఖలు చేశారు. జై భారత్ పార్టీ అభ్యర్థిగా బొల్లవరం గ్రామానికి చెందిన బి.వెంకటరాముడు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామం నుంచి ర్యాలీగా బయల్దేరి నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసుకు నామినేషన్ పత్రాలను అందజేశారు. బొర్రెల్లి వెంకటరాముడుతోపాటు వైసీపీకి చెందిన కాటం వెంకటరమణ, భారతచైతన్య యువజన పార్టీకి చెందిన చిన్న వెంకటరమణ, సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియాకు చెందిన షాబోలు లింకన్ రాజు నామినేషన్లు దాఖలు చేశారు.

కాంగ్రెస్ సామాన్యుల పార్టీ

- ఎంపీ అభ్యర్థి లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, ఏప్రిల్ 23: కాంగ్రెస్ పార్టీ సామాన్యుల పార్టీ అని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జె.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. మంగళవారం ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ తరుపున నామినేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులుకు అందజేశారు. నామినేషన్ వేసిన అనంతరం కలెక్టరేట్ వెలుపల లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడారు. ప్రజా సేవలో కులమతాలకు అతీతంగా మమేకమయ్యే పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలను ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే సమాజంలోని అన్ని వర్గాల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని అయిన వెంటనే ఏపీకి ప్రత్యేక హోదాపై తొలిసంతకం చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని అన్నారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున పోటీ చేయడం జరిగిందన్నారు.

ఏకశిల అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న సినీ దర్శకుడు

బండిఆత్మకూరు, ఏప్రిల్ 23: మండలంలోని పెద్దదేవళాపురం గ్రామ శివారులో వెలసిన ఏకశిలా అభయాంజనేయ స్వామిని సినీ దర్శకుడు కేఎస్ వర్మ దర్శించుకున్నారు. మంగళవారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని దర్శించుకున్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలో జగన్నాథ బ్యానర్‌పై ప్రకృతి పరిరక్షణ కథా సారాంశంతో వందే విష్ణుం సినిమా తెలుగులో తీయబోతున్నామన్నారు. ఈ సినిమా షూటింగ్ 18 రోజులపాటు దేవస్థానం ఆవరణంలో చిత్రీకరిస్తామని, అనంతరం అరకు, బెంగళూరు, ఊటీ, హైదరాబాద్, ముంబై ప్రాంతాల్లో పూర్తి చేస్తామని చెప్పారు.

హోంగార్డుల పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 23: టెన్త్, ఇంటర్మీడియట్‌లలో ప్రతిభ చూపిన నంద్యాల జిల్లాలోని హోంగార్డుల పిల్లలకు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభలో ఈ మేరకు ఎస్పీ టెన్త్, ఇంటర్‌లలో ప్రతిభ చూపిన పది మందికి ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జిల్లా హోంగార్డ్స్ వెల్ఫేర్ ఫండ్ నుంచి చెక్కులను అందజేశారు. హోంగార్డ్ కమాండెంట్ మహేష్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 23: తర్తూరు గ్రామంలోని లక్ష్మీరంగనాథస్వామి జాతర సందర్భంగా జాతరలో చెరుకురసం బండి ఏర్పాటు చేసుకోడానికి విద్యుత్తు తీగలు లైనుకు తగిలించుకుంటుండగా ప్రమాదవశాత్తు షాక్‌తో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల మేరకు నందికొట్కూరు పట్టణం వడ్డెపేటకు చెందిన ఎల్లప్ప(24) చెరుకురసం బండి ఏర్పాటు చేసుకున్నాడని చెప్పారు. విద్యుత్ శాఖ అధికారులకు సరఫరా ఇవ్వాలని కోరగా కొంత సమయం తర్వాత వరసగా ఇస్తామని చెప్పినట్లు, అంతలోపే యువకుడే సరఫరా తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు షాక్ తగలడంతో అక్కడిక్కడే కుప్పకూలిపోయాడని ఎస్ఐ తెలిపారు. వెంటనే నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకుస్థానికులు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజల్లో చిచ్చు పెట్టడమే శిల్పా నైజం: బుడ్డా



మైనార్టీల ఆత్మీయ సదస్సులో ముఖ్యులను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం



సమావేశానికి హాజరైన ముస్లిం మైనార్టీలు

ఆత్మకూరు, ఏప్రిల్ 23: ఆత్మకూరు ప్రాంతంలో సోదరభావంతో కలిసి ఉండే హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టడమే ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నైజమని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆరోపించారు. ఆత్మకూరులోని ఎంఎం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శ్రీశైలం నియోజకవర్గం ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ హాజరయ్యారు. బుడ్డా మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రెండు మసీదుల సమస్య తన దృష్టికి రావడంతో సామరస్యంగా పరిష్కరించి వాటి నిర్మాణానికి చొరవ తీసుకున్నానని అన్నారు. అయితే ఎమ్మెల్యే శిల్పా ఓ మసీదు విషయంలో హిందూ, ముస్లింలను రెచ్చగొట్టి ప్రజల మధ్య చిచ్చుపెట్టడం బాధాకరమని అన్నారు. వెలుగోడు, గాజులపల్లిలోని షాదీఖానాల నిర్మాణాలకు తాను సుమారు రూ.3కోట్లకు పైగా నిధులు మంజూరు చేయిస్తే ఆపనులు ముందుకు సాగలేదని వివరించారు.

సీఏఏపై వైసీపీ తప్పుడు ప్రచారం

ప్రత్యేకించి ఎన్ఆర్సీ, సీఏఏ విషయంలో పార్లమెంట్‌లో బహిరంగంగానే మద్దతు ఇచ్చిన వైసీపీ నేడు ఎన్ఆర్సీ, సీఏఏలపై తప్పుడు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని షరీఫ్ అన్నారు. అంతేకాదు ముస్లింల 4శాతం రిజర్వేషన్లపై ఎలాంటి అపోహలు వద్దని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసమే టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల పొత్తు ఏర్పడిందని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ ఇక్బాల్ అహ్మద్, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్అహ్మద్, జిల్లా అధ్యక్షుడు కలీముల్లా, నాయకులు అమీర్‌హంజా, నజీర్‌అహ్మద్, హిదాయత్ అలిఖాన్, ఖలీలుల్లాఖాన్ తదితరులు ఉన్నారు.

● ఆత్మకూరులో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి మరో భారీ షాక్ తగిలింది. ఇంతకాలం ఎమ్మెల్యే శిల్పా వెంట నడిచిన వైసీపీ నాయకులు పాలు పైల్వాన్ తన బంధువర్గంతో కలిసి మంగళవారం శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరారు. అనంతరం భారీ గజమాలతో మాజీ ఎమ్మెల్యే బుడ్డాను సత్కరించారు. పెద్దఅనంతాపురం గ్రామానికి చెందిన బీ.మహేశ్వరరెడ్డి, వార్డు సభ్యులు దరణి ఆధ్వర్యంలో పలు కుటుంబాలు, ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కృష్ణమోహన్‌చౌదరి, పెద్దస్వామి, మల్లికార్జునతో పాటు మరో 12కుటుంబాలు బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరాయి.

బండిఆత్మకూరు: ఎవరికీ భయపడాల్సిన పనిలేదని, ఎళ్లవేళలా అండగా ఉంటానని టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని కడమలకాల్వ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కర్నాటి సుబ్బలక్ష్మయ్య, రామకృష్ణ, సీహెచ్ వెంకట రమణలకు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. సురేష్‌రెడ్డి, మదన భూపాల్, పుష్పరాజ్, పాలశంకర్ పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన కడమలకాల్వ వైసీపీ నాయకులు

వైసీపీ పాలనలో దౌర్జన్యాలు పెరిగాయి: చరిత

పాణ్యం, ఏప్రిల్ 23: వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, దాడులు పెరిగాయని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. మండలంలోని రసూళ్లపేట, వడ్డుగండ్ల, నెరవాడ, కౌలూరు గ్రామాలలో మంగళవారం నిర్వహించిన టీడీపీ శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇటీవల ఓర్వకల్లు మండలం తడకనపల్లెలో ముస్లింలపై దాడులు చేశారన్నారు. అలాగే గడివేముల మండలం దుర్వేశిలో టీడీపీ కార్యకర్తపై దాడి చేసి గాయపర్చారన్నారు. వైసీపీ పాలనలో మహిళలపై దాడులు పెరిగాయన్నారు. కొందరు వైసీపీ నాయకులు రెండు వర్గాలకు గొడవలు పెట్టి తామే పంచాయితీలు పెట్టి పరిష్కరిస్తున్నట్లు నటిస్తున్నారన్నారు. ధాన్యం తనకే విక్రయించాలని వైసీపీకి చెందిన ఒక ధాన్యం వ్యాపారి బెదిరిస్తునట్లు రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని, ఇటువంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధిని విస్మరించారన్నారు. సమగ్ర భూసర్వే పేరిట జగన్ రైతుల భూములను అస్తవ్యస్తం చేశారన్నారు. తాత, ముత్తాతల కాలంనాటి భూముల పాసుపుస్తకాలపై, పంటపొలాల్లోని సరిహద్దు రాళ్లపై తన ముఖచిత్రం వేసుకోవడంపై రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు.



వైసీపీ నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గౌరు చరిత



ప్రచారంలో పాల్గొన్న గౌరు చరిత

రైతుల భూముల ఆన్‌లైన వివరాలు తప్పల తడకగా మారాయన్నారు. కోట్లాది రూపాయల ప్రజల డబ్బు ఖర్చు చేసి పంపిణీ చేసిన పాసుపుస్తకాలు ఎందుకూ పనికి రాకుండా నిరుపయోగమయ్యాయన్నారు. ప్రజలకు మేలు చేసే పార్టీని గెలిపించుకోవాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దౌర్జన్యంగా ఆక్రమించిన భూములపై ప్రత్యేక కమిటీ వేస్తామన్నారు. పేద అన్న క్యాంటీన్లు మూసివేసి పేదల కడుపుకొట్టిన జగన్‌కు గుణపాఠం తప్పదని అన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు పేద బడుగు వర్గాల అభివృద్ధి కోసమే తయారు చేశారన్నారు. టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఐదేళ్లలో కనీసం రెట్టింపు ఆదాయం చేకూరేలా టీడీపీ మేనిఫెస్టో తయారు చేసిందన్నారు. నెరవాడలో వైసీపీకి చెందిన జ్యోతి స్వరూపరెడ్డి, ప్రభాకరరెడ్డి, నారాయణ రెడ్డి, కురువ ఎల్లయ్య, ప్రభుశేఖరరెడ్డి, మదార్‌సా కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఎంపీటీసీ భాస్కరరెడ్డి, మండల కన్వీనర్ గణపం జయరామిరెడ్డి, శివశంకరరెడ్డి, అమరసింహారెడ్డి, ప్రతాపరెడ్డి, మాజీ జడ్పీటీసీ మెంబరు నారాయణమ్మ, టీడీపి జిల్లా కార్యదర్శి రమణమూర్తి, రాంమోహన్‌నాయుడు, ఖాదర్‌బాషా, రాంపుల్లారెడ్డి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్

ప్రజలు టీడీపీని కోరుకుంటున్నారు

● అభ్యర్థి గిత్తా జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి ప్రచారం



నందికొట్కూరులో ప్రచారం చేస్తున్న మాండ్ర శివానందరెడ్డి



మిడుతూరు: తలముడిపి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న గిత్తా జయసూర్య

నందికొట్కూరు, ఏప్రిల్ 23: ఒక్క చాన్స్ పేరుతో సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని టీడీపీ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య, నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, మాండ్ర లింగారెడ్డి వేర్వేరుగా ప్రచారం చేశారు. 9వ వార్డులో గిత్తా జయసూర్య, 25వ వార్డులో మాండ్ర శివానందరెడ్డి, 11వ వార్డులో లింగారెడ్డి బాబు సూపర్ సిక్స్, ఎన్నికల శంఖారావం కార్యక్రమాలను నిర్వహించారు. శివానందరెడ్డి మాట్లాడుతూ జగన్ రాక్షస పాలనకు వీడ్కోలు చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, అదే క్రమంలో టీడీపీని కోరుకుంటున్నారని అన్నారు. జయసూర్య మాట్లాడుతూ పట్టణంలోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఇంటింటికి కొళాయి ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ నాయకుడు లింగారెడ్డి మాట్లాడుతూ యువతను నట్టేట ముంచిన చరిత్ర జగన్‌కే దక్కుతుందన్నారు. జగన్ సీఎం పదవిని ఒక వ్యాపారంగా మార్చారని ఆయన ఆరోపించారు.

● పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో జయసూర్యను ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమాల్లో మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మాండ్ర వెంకటరామిరెడ్డి, మాండ్ర పురుషోత్తం రెడ్డి, మాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కేజీఎన్ ఖాదర్, వేణుగోపాల్, షకీల్ అహ్మద్, ముర్తుజావలి, లాయర్ జాకీర్, జమీల్, కళాకర్, రాజు, మోహన్, వెంకటేశ్వర్లు, గని, లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని 4వ వార్డు ఇన్‌చార్జి వడ్డె శ్రీను, బూతు ఇన్‌చార్జి సురేష్‌ల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మాండ్ర లింగారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రసాద్‌రెడ్డి, ముర్తుజావలి, రసూల్, జమీల్, మల్లికార్జునరెడ్డి, భరత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేంద్ర, శేఖర్, ప్రభుకుమార్ పాల్గొన్నారు.

మిడుతూరు: టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రతి కుటుంబానికి సంక్షేమం అందుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, వంగాల శివరామిరెడ్డి ఆధ్వర్యంలో తలముడిపిలో ప్రచారం నిర్వహించారు. మాండ్ర సురేంద్ర రెడ్డి, మాండ్ర పురుషోత్తం రెడ్డి, రవికాంత్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, దస్తగిరి, సామన్న, మారన్న, నాగేంద్ర పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: పేదలకోసం అమలు చేయనున్న సూపర్ 6 పథకాలను చూసి ప్రజలు టీడీపీ అభ్యర్థులను గెలిపించి, చంద్రబాబును సీఎం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. బుధవారం తూడిచర్ల గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో శంఖారావం కార్యక్రమం నిర్వమించారు. టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లుయాదవ్, నాయకులు సురేష్, పుల్లన్నయాదవ్, వేణుగోపాల్, సంపత్‌యాదవ్, సంబజన్న, రాముడు, పాల్గొన్నారు. ఇటీవల రాజీనామా చేసిన వలంటీరు రవికుమార్ మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరారు.



నందికొట్కూరులో ప్రచారం చేస్తున్న మాండ్ర లింగారెడ్డి

రమణీయం.. రంగనాథ స్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 23: తర్తూరు గ్రామంలోని లక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం రమణీయంగా జరిగింది. ముందుగా స్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకిలో ఊరేగించారు. అనంతరం రథంలో స్వామివారిని ఉంచి గోవింద నామ స్మరణంతో వేలాది మంది భక్తుల మధ్య ఊరేగించారు. పూజల్లో టీడీపీ నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జి శివానందరెడ్డి, టీడీపీ నంద్యాల పార్లమెంటు అభ్యర్థి శబరి, నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య, దేవాలయ అధికారి వెంకటరమణ, తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఎంపీడీవో పాల్గొన్నారు. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు రమణారెడ్డి, రామోహ్మన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, గుండం రమణారెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

● రథోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయమే వివిధ గ్రామాల నుంచి బక్షాలబండ్లు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. పంటలు వచ్చిన సమయంలో స్వామివారిపేరు మీద తీసిపెట్టిన ధాన్యంతో చేసిన భక్ష్యాలను నైవేద్యం సమర్పించడం ఆనవాయితీ.

'లక్ష్యాలను సాధించాలి'

ఆత్మకూరురూరల్, ఏప్రిల్ 23: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని లక్ష్యాన్ని చేరుకునే వరకు పాటు పడాలని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం ఆత్మకూరు మండలంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు మండల టాపర్‌గా నిలిచిన చెన్నారెడ్డి రశ్మిత (592)అనే విద్యార్థినిని వారు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.

వైసీపీ ఓటమి ఖాయం: శబరి



నెరవాడలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బైరెడ్డి శబరి

పాణ్యం, ఏప్రిల్ 23: వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని నంద్యాల టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా మంగళవారం నెరవాడలో ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టీడీపి సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. టీడీపీ నాయకులు అమరసింహారెడ్డి, జ్యోతి స్వరూపరెడ్డి, ప్రభాకరరెడ్డి, మదార్‌సా, జోసఫ్, సుబ్బయ్య ప్రభుశేఖర్‌రెడ్డి, ఎల్లయ్య, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ధవనోత్సవం

శ్రీశైలం, ఏప్రిల్ 23: శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం స్వామి, అమ్మవార్లకు ధవనోత్సవ కార్యక్రమాన్ని దేవస్థానం సంప్రదాయబద్ధంగా నిర్వహించింది. ప్రధానాలయ రాజగోపురానికి ఎదురుగా శాస్త్రోక్తంగా అగ్ని ప్రతిష్ఠాపన చేసి ఆజ్యం, దవనం, గుగ్గిలం ఆహుతిగా వేసి స్వామి, అమ్మవార్లకు ధవనోత్సవం చేశారు. కార్యక్రమంలో ముందుగా అర్చకులు లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ సంకల్పం పఠించారు. ఆలయ ఈవో డి.పెద్దిరాజు, ఏఈవో హరిదాసు, స్వామివారి ప్రధానార్చకులు శివప్రసాద్‌స్వామి పాల్గొన్నారు. గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని, అమ్మవారికి లక్ష కుంకుమార్చన, స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ, పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం అక్కమహాదేవి జయంతి వేడుకను దేవస్థానం నిర్వహించింది. ఆలయ ఈవో డి. పెద్దిరాజు పాల్గొన్నారు. కుంభోత్సవం నేపథ్యంలో మంగళవారం కొబ్బరికాయలు సమర్పించారు.



ధవనోత్సవాన్ని నిర్వహిస్తున్న అధికారులు, అర్చకులు

వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులపాలు: బైరెడ్డి



దేవనూరులో మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

మిడుతూరు, ఏప్రిల్ 23: వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులపాలైందని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చౌట్కూరు, 49 బన్నూరు, గుడిపాడు, దేవనూరు, చింతపల్లి గ్రామాల్లో టీడీపీని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. బైరెడ్డి మాట్లడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వా అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. టీటీపీ నంద్యాల లోక్ సభ అభ్యర్థి బైరెడ్డి శభరిని అత్యదిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను బైరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఉశేన్, అబ్దుల్లా, నాగేంద్ర, ఖలీం, హహేష్, రమణరెడ్డి, మణివర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

కమనీయం.. చెన్నకేశవ స్వామి కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

బేతంచెర్ల, ఏప్రిల్ 23: పట్టణంలోని గౌరిపేట ఆంజనేయస్వామి ఆలయంలో చెన్నకేశవస్వామి కల్యాణాన్ని అర్చకులు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రూపు దేవాలయ ఈవో మద్దిలేటి, ధర్మకర్తల మండలి చైర్మన్ జగన్మోహన్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీకంబగిరి స్వామి ఆలయంలో..

అవుకు: అవుకు మండలం ఎర్రమల కొండల్లో వెలసిన లక్ష్మీకంబగిరి స్వామి కల్యాణం మంగళవారం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సూర్యప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహించారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

సంజామల, ఏప్రిల్ 23: ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర అన్నారు. మంగళవారం జిల్లా సరిహద్దు ప్రాంతమైన నొస్సం చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ రమేశ్‌రెడ్డితో కలసి వాహనాలను తనిఖీ చేశారు. నొస్సం, అక్కంపల్లె గ్రామాల్లో ప్రజలతో గ్రామ సభ నిర్వహించారు. అనంతరం నొస్సం, అక్కంపల్లె పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.

నేడు కోట్ల నామినేషన్

డోన్, ఏప్రిల్ 23: డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇప్పటికే కోట్ల తరపున మూడు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కోట్ల పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ నామినేషన్ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని కోరారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 23: మండలంలోని నందిపాడు గ్రామంలో మంగమద్దెల మరియమ్మ అనే మహిళపై దాడి ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు. మరియమ్మ ఇంటి వద్ద వున్న కొళాయిలో నీరు పట్టుకొనే విషయంలో అదే గ్రామానికి చెందిన నడిపి రంగడు, అతని భార్య దాడిచేసి గాయపరిచారని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

బనగానపల్లె, ఏప్రిల్ 23: బనగానపల్లె నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి వైసీపీ శ్రేణులు భారీగా వచ్చి చేరుతున్నారు. బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో తుమ్మలపెంటకు చెందిన 80 కుటుంబాలు, బెలుంకు చెందిన 45 కుటుంబాలు, కొలిమిగుండ్ల, అంకి రెడ్డిపల్లె, సంజామల మండలం ఎగ్గోనికి చెందిన మరో 75 కుటుంబాలు మొత్తం 200 కుటుంబాలు వైసీపీని వీడి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. టీడీపీలో చేరిన వారిలో తుమ్మలపెంటకు చెందిన వైసీపీ నాయకులు కలమల బాలస్వామిరెడ్డి, శేషారెడ్డి, ఆదిరెడ్డి, హుసేన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, బెలుంకు చెందిన మారం ప్రభుదాసు, బాల ఏసయ్య, జయప్రసాద్, నాగరాజు, నాగేశ్వరరావు, అంకిరెడ్డిపల్లెకు చెందిన ఆదినారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, అంకాల్‌రెడ్డి, అన్వర్‌నాథరెడ్డి, అంకిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఓబుళరెడ్డి తదితర కుటుంబాలు టీడీపీలో చేరాయి. అలాగే కొలిమిగుండ్లకు చెందిన మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ తన అనుచరులతో కలసి బనగానపల్లె టీడీపీలో చేరారు. అలాగే సంజామల మండలం ఎగ్గోని గ్రామ వలంటీరు సందింటి ప్రసాద్‌తోపాటు మద్దిలేటి, చౌడయ్య, హుసేనయ్య, నాగేంద్రుడు, సుదర్శన్ టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మూలె రామేశ్వరరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

కంపు కొడుతున్న మురుగు కాల్వలు: బీసీ

బనగానపల్లె పట్టణంలో వైసీపీ పాలన అధ్వానంగా మారడంతో మురుగు కాల్వలు కంపు కొడుతున్నాయని టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం బనగానపల్లె పట్టణంలోని మార్కెట్ వీధి, ఈద్గానగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ వైసీపీ పాలనలో బనగానపల్లె పట్టణంలో డ్రైనేజీ కాల్వల్లో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి కంపు కొడుతున్నాయని విమర్శించారు. గత టీడీపీ హయంలో మురుగుకాల్వలను పరిశుభ్రం చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి రవి చంద్ర, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

సంజామల: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి కుమార్తె మనోరమ, కోడలు క్షీరారెడ్డిలు అన్నారు. మంగళవారం మండలంలోని మిక్కినేనిపల్లె గ్రామంలో టీడీపీ మండల ఇన్‌చార్జి బత్తుల ప్రతాప్‌రెడ్డి, కాట్రెడ్డి కృష్ణారెడ్డితో కలసి ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, రామిరెడ్డి, మహబూబ్ బాషా, విశ్వనాథరెడ్డి, సుబ్బారెడ్డి, మదార్ బాషా పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే బీసీ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ వర్గీయులు, సంజామల మండలం మిక్కినేనిపల్లెలో ప్రచారం చేస్తున్న బీసీ మనోరమ, క్షీరారెడ్డి


బనగానపల్లెలో కూరగాయల వ్యాపారి కష్టాలు వింటున్న బీసీ జనార్దన్‌రెడ్డి

కలిసికట్టుగా పని చేయాలి

డోన్, ఏప్రిల్ 23: టీడీపీ నాయకులు, కార్యకర్తలంతా కలిసికట్టుగా పని చేయాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జోన్-5 పార్టీ ఇన్‌చార్జి బీద రవిచంద్ర యాదవ్ అన్నారు. మంగళవారం డోన్ పట్టణంలోని కోట్ల నివాసంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, బీద రవిచంద్ర యాదవ్‌తో కలిసి ఆ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తదితరుల బృందంతో భేటీ అయ్యారు. డోన్ నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు. నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశమై ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. పార్టీలో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. టీడీపీ మేనిఫెస్టోతో ప్రతి ఇంటికి ఎంత మేలు జరుగుతుందో ప్రజల్లో మరింత విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'

చాగలమర్రి, ఏప్రిల్ 23: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని 212 బూత్ పరిధిలో ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: టీడీపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపురం, వీరారెడ్డిపల్లె, కోటపాడు గ్రామాల్లో మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాల కోసం ముందుచూపుగా వ్యవహరించే చంద్రబాబును సీఎంగా చేసుకుంటేనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటును అమ్ముకోవద్దు: ఆర్వో

నంద్యాల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటును అమ్ముకోవద్దని ఆళ్లగడ్డ అసెంబ్లీ ఆర్వో మల్లికార్జునరెడ్డి సూచించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఓటర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ షర్ఫుద్దీన్, పట్టణ సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ వెంకటరెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, ఏఆర్వో నజీర్ అహమ్మద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి'

రుద్రవరం, ఏప్రిల్ 23: తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో రామచంద్ర అన్నారు. మంగళవారం గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని 16 సచివాలయాలు, 21 గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జగన్‌కు బుద్ధి చెబుదాం

బేతంచెర్ల, ఏప్రిల్ 23: ఎస్సీ కార్పొరేషన్ నిధులను నిర్వీర్యం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని మాల సంఘాల జేఏసీ నేత యనుముల రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని గోర్లగుట్ల గ్రామంలో సంఘం నాయకులతో సమావేశమయ్యారు. వెంకటేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సర్వే ఓ బూటకం: అఖిలప్రియ

రుద్రవరం, ఏప్రిల్ 23: రాష్ట్రంలో భూ సర్వే ఓ బూటకమని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై మండిపడ్డారు. మండలంలోని కోటకొండ, టి.కొట్టాల, శ్రీరంగాపురం, డి.కొట్టాల గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా తొలిరోజు రోడ్‌షోలో పాల్గొని మాట్లాడారు. 2019లో శ్రీరంగాపురం ఎస్ఎస్ ట్యాంకుకు గండి పడగా పూడ్చిస్తామని అప్పట్లో ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, అయితే ఇచ్చిన హామీ ఐదేళ్లు పూర్తయినా నెరవేర్చలేదని విమర్శించారు. రైతులను నమ్మించేందుకు భూ సర్వే సీఎం జగన్ ఆడిన డ్రామా అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో రాజు, బాచుపల్లె నరసింహుడు, వెంకటపతి, సూర్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ నంద్యాల నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి పల్లకి సేవ

బనగానపల్లె, ఏప్రిల్ 23: నందవరం చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి పల్లకిసేవ, సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. ఈవో కామేశ్వరమ్మ, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు.

మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ

బేతంచెర్ల: మండలంలోని ముద్దవరం గ్రామ పొలిమేరలో మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్థులు పూజలు చేశారు.

జగన్ దుర్మార్గ పాలనను అంతం చేద్దాం

మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి


కోట్ల కుటుంబ సభ్యులను కలిసిన కేఈ కృష్ణమూర్తి దంపతులు

డోన్, ఏప్రిల్ 23: అధికారం అడ్డం పెట్టుకుని సీఎం వైఎస్ జగన్ సాగించిన దుర్మార్గపు పాలనను అంతం చేద్దామని మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం డోన్ పట్టణంలోని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి నివాసానికి కేఈ కృష్ణమూర్తి, ఆయన సతీమణి పద్మావతమ్మ వెళ్లారు. బుధవారం కోట్ల నామినేషన్ వేస్తుండటంతో వారు ఆశీస్సులు అందించారు. నామినేషన్ కార్యక్రమానికి హాజరు కావాలని కోట్ల దంపతులు కేఈని కోరారు. ఈ సందర్భంగా కేఈ కృష్ణమూర్తి మాట్లాడుతూ సీఎం జగన్ తాడేపల్లి ప్యాలెస్‌ను సెటిల్మెంట్ల దందాకు అడ్డాగా మార్చి రాష్ట్ర సంపదను దోచేశారని ఆరోపించారు. బటన్ నొక్కడం తప్ప సీఎం జగన్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. వైసీపీ పాలనలో విద్యుత్‌చార్జిలు ఏడుసార్లకుపైగా పెంచి ప్రజలపై పెనుభారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘనంగా మారెమ్మ జాతర

బనగానపల్లె, ఏప్రిల్ 23: బనగానపల్లె మండలం పసుపుల గ్రామ పంచాయతీ పరిధిలోని కాలేనాయక్ తండాలో జరిగిన మారెమ్మ జాతరకు పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పాల్గొన్నారు. టీడీపీ నాయకుల ఆయనకు స్వాగతం పలికారు. ఆలయం వద్ద బీసీ రాజారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో పూజలు

కొలిమిగుండ్ల రూరల్, ఏప్రిల్ 23: కొలిమిగుండ్ల, అబ్దులాపురం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. పౌర్ణమి పురస్కరించుకొని కొలిమిగుండ్లలోని చౌడేశ్వరి, పెద్దమ్మతల్లి ఆలయాల్లో భక్తులు బోనాలు సమర్పించారు.